## అక్షర యశస్వి ఆచార్య ఎస్వీరామారావు

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**

రవీంద్రభారతి, జూలై 13 ప్రభాతవార్త : ఆచార్య ఎస్వీ రామారావు అక్షర యశస్వీ, అక్షరశిల్పి అని తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. డా. ఎస్.వి.రామారావులో సాహితీకిరణాలు ఎంతో గొప్పగా ప్రసరించాయని, అందుకే ఆయన యశస్వీ రామారావు అని అభివర్ణించారు. ఈ సందర్భంగా ఎస్వీ రామారావుతో సాన్నిహిత్యాన్ని, అనుబంధాన్ని సవివరపరుస్తూ నేడు తన అత్యున్నత స్థితికి ముఖ్యకారకుడు ఆయనేని స్పష్టం చేశారు. రామారావు గొప్ప తెలుగు భాషాభిమాని ఎన్నో గొప్పగొప్ప రచనలు చేశారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, ఎం.వి.ఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరం ఆదివారం రాత్రి తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన ఆచార్య ఎస్వీ రామారావు సాహితీ సమాలోచన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుప్రసిద్ధ సాహితీవేత్త విహారి విశిష్ట అతిథులు డా. టి.గౌరీశంకర్, సుధామ, డా. మారుమాముల దత్తాత్రేయశర్మ, చీకోలు సుందరయ్య, డా. ఆచార్య ఫణీంద్ర, మట్టిగుంట వెంకటరమణ తదితరులతో కలిసి అక్షరశిల్పి ఆచార్య డా. ఎస్వీ రామారావును ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు. అనంతరం అతిథులు ఆచార్య ఎస్వీ రామారావు సాహిత్య పరిమళాలను గుభాళింపజేశారు.



ఎస్వీరామారావును ఘనంగా సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

హైదరాబాద్ వార్త





# బోనమెత్తిన లష్కర్

* ఉజ్జయినీ మహంకాళి దర్శనానికి పోటెత్తిన భక్తజనం
* అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి
* నేడు రంగం, అంబారీ ఊరేగింపు
* మంత్రులు, వీఐపీల రాకతో కిటకిటలాడిన సికింద్రాబాద్ పరిసరాలు

**హైదరాబాద్, జూలై 13 ప్రభాతవార్త :** శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలు.. బాజాభజంత్రీల మధ్య లష్కర్ బోనమెత్తింది. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. లష్కర్ వీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. వేలాది మంది భక్తులు అమ్మవారికి బోనాలు, సాక, తొట్టెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర సందర్భంగా సికింద్రాబాద్‌లో ఎటు చూసినా భక్తజన కోలాహలమే కనిపించింది. ఉదయం అమ్మవారి ఆలయానికి చేరుకున్న సిఎం రేవంత్‌రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి సిఎం పట్టు వస్త్రాలను సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.సీఎం వెంట మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేష్, తదితరులు ఉన్నారు. అంతకుముందు అమ్మవారిని మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు దర్శించుకుని ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తొలి బోనం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎంపి ఈటల రాజేందర్ తదితర ప్రముఖులు ఉన్నారు. నగరం నుంచే కాకుండా జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచీ భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం రంగం జరగనుంది. స్వర్ణలత భవిష్యవాణి వినిపించనున్నారు. సాయంత్రం రూపావతి ఏనుగు అంబారీ ఊరేగింపు ఉండనుంది.



అమ్మవారిని దర్శించిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్



అమ్మవారిని దర్శించుకున్న సివి ఆనంద్



అమ్మవారిని దర్శించుకున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుటుంబం



అమ్మవారిని దర్శించుకున్న మేయర్ విజయలక్ష్మి



అమ్మవారికి బోనాలను తీసుకెళుతున్న మహిళలు

## వైభవంగా సామూహిక ఘట స్థాపన ఊరేగింపు

**చార్మినార్, జూలై 13 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో ఆషాడమాస బోనాల జాతర ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా సామూహిక ఘట స్థాపన ఊరేగింపు కార్యక్రమం జరిగింది. శాలిబండలోని శ్రీకాశీ విశ్వనాథ్ దేవాలయం నుంచి ప్రారంభమైన సామూహిక ఘట స్థాపన ఊరేగింపు శాలిబండ, లాల్‌దర్వాజ చౌరస్తా, లాల్‌దర్వాజ, చందూలాల్ బేలా, గౌలిపురతో పాటు పలు ప్రధాన రహదారులలో కొనసాగింది. లాల్‌దర్వాజ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన వేదిక నుంచి రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, గౌలిపుర డివిజన్ కార్పొరేటర్ అలె భాగ్యలక్ష్మి, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి చైర్మన్ జి.రాఘవేందర్, మీరాలం మండి శ్రీ మహంకాళీ మందిరం కమిటి చైర్మన్ గాజుల అంజయ్య, బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు జి,కన్నయ్యలాల్ సామూహిక ఘట స్థాపన ఊరేగింపుకు స్వాగతం పలికారు.

లాల్ దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి అమ్మవారి ఘటం, ఉప్పుగూడ మహంకాళీ అమ్మవారి ఘటం, సుల్తాన్ షాహి శ్రీజగదాంబ అమ్మవారి ఘటం, అక్కన్న మాదన్న శ్రీమహంకాళీ అమ్మవారి ఘటం తోపాటు పాతబస్తీలోని 22 ఆలయాలకు సంబం ధించిన 22 అమ్మ వారి ఘటాలు సామూహిక ఘట స్థాపన ఊరేగింపుల పాల్గొన్నాయి.

ఘటాల ఊరేగింపు అనంతరం దేవాలయాలలో ఘట స్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సుల్తాన్‌షాహి శ్రీ జగదాంబ ఆలయం కమిటి చైర్మన్ రాకేష్ తివారి, అక్కన్న, వివిధ ఆలయాల కమిటీల ప్రతినిధులు రామ్‌దేవ్ అగర్వాల్, ఎస్‌పి క్రాంతి కుమార్, డి.ఆనంద్ గుప్తాతో పాటు పలువురు పాల్గొన్నారు. సామూహిక ఘట స్థాపన ఊరేగింపు సందర్భంగా పాతబస్తీలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.



ఘట స్థాపన ఊరేగింపుకు స్వాగతం పలుకుతున్న రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్





మాట్లాడుతున్న జంగయ్య

## ప్రతీ పేదకు ఇళ్ల స్థలం వచ్చేలా పోరాడతాం

**- సిపిఐ జిల్లా కార్యదర్శి జంగయ్య**

**నార్సింగి, జూలై 13 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లాలోని ప్రతీ పేదకు ఇళ్లస్థలం వచ్చేలా సిపిఐ పార్టీ పోరాటాలు చేస్తుందని జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పేర్కొన్నారు. ఆదివారం గండిపేట మండలంలో సిపిఐ నాలుగో మహాసభను నిర్వహించారు. సభలో జంగయ్య మాట్లాడుతూ సిపిఐ వందేళ్ల సంబరంలోకి అడుగుపెడుతుందన్నారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా పెద్దఎత్తున శతాబ్ది ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పేదల కోసం పుట్టిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నామని, పేదలకు తలదాచుకునేందుకు ఇళ్ల స్థలాల కోసం ఉద్యమిస్తున్నామన్నారు. ఈ సమావేశంలోనే గండిపేట మండల సిపిఐ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యదర్శిగా మల్లేష్, సహాయ కార్యదర్శిగా శ్రీకాంత్‌లతో పాటు 15.మంది కౌన్సిల్ సభ్యులుగా నియమించుకున్నారు. ఈ మహాసభలో సిపిఐ నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావ్, పర్వతాలు, యాదయ్య, స్వామి బాబురావ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫిరోజ్ గూడాలో ఘనంగా బొడ్రాయి పండుగ...

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 13, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి బాలనగర్ ఫిరోజ్గూడలో ఆదివారం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ బొడ్రాయి ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్‌ని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించగా ఆయన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మయ్య, మాదిరెడ్డి యుగేందర్ రెడ్డి, బందిగా బాలనరసింహ, శేఖర్ గజానంద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు.. రూ.4.54 లక్షల నగదు స్వాధీనం**

**సరూర్‌నగర్, జూలై 13 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని ఓ కాలనీలో భారీ మొత్తంలో డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. దాడుల్లో పోలీసులు వారి వద్ద నుండి రూ.4.54 లక్షల నగదును, ఎనిమిది సెల్‌ఫోన్లను, పేకాట కార్డులను స్వాధీనం చేసుకొని కేసును నమోదు చేశారు. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ కీసర నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్ ఆర్ఎంఆర్ కాలనీలో శనివారం సాయంత్రం ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు మీర్‌పేట్ పోలీసులు, ఎల్‌బినగర్ ఎస్ఓటి సిబ్బంది సంయుక్తంగా దాడులు చేశారు. ఈ నేపథ్యంలో పేకాటలో కూర్చున్న ఎనిమిది మంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ మేరకు వారి వద్ద నుండి భారీ మొత్తంలో నగదుతో పాటు వారు వాడుతున్న చరవాణిలను, పేకాటకు సంబంధించిన రెండు సెట్ల కార్డులను స్వాధీనం చేసుకొన్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించి కేసును నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



పట్టుబడ్డ పేకాటరాయుళ్లు, భారీ మొత్తంలో నగదుతో పాటు సెల్‌ఫోన్లు



మహాకాళీ అమ్మ వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే తలసాని

## శ్రీఉజ్జయినీ మహాకాళీని దర్శించుకున్న ఎమ్మెల్యే

**బేగంపేట, జూలై 13 ప్రభాతవార్త :** ఆషాడ బోనాల జాతర సందర్భంగా సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు పూర్ణకుంభంతో తలసానికి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయ పరిసరాలలో కలియ దిరుగుతూ క్యూలైన్లలోని భక్తులను ఆప్యాయంగా పలుకరించారు. ఏర్పాట్లపై ఆరా తీసారు. భక్తులు ఇబ్బందులకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేసారు. అనంతరం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఆయన వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రంలో సుభిక్షంగా పంటలు పండాలని, అమ్మ వారు ప్రజలందరినీ చల్లగా చూడాలని అమ్మ వారిని కోరుకున్నానన్నారు.

# సార్లూ..దోమలు సంపుతున్నాయ్..!

* దోమల నివారణపై పట్టించుకోని బల్దియా
* ఫాగింగ్.. యాంటీ లార్వా ఆపరేషన్లు లేవు
* శివారు మున్సిపాలిటీల్లో పరిస్థితి దారుణం
* ఎంటమాలజీ విభాగంపై తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, జూలై 13 :** వానాకాలం సీజన్ కావడంతో దోమల బెడద ఎక్కువవుతుంది. దీంతో సిటీలో బల్దియా రెగ్యులర్‌గా ఫాగింగ్ చేయడం లేదు. కేవలం వీఐపీలు ఉండే ప్రాంతాలు తప్ప.. మిగతా ప్రాంతాల్లో నామ్‌కేవాస్తేగా చేస్తుండగా సమస్య తీవ్రమవుతోంది. కొన్ని ఏరియాల్లోని ప్రజలు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదు. వెంటనే ఫాగింగ్‌కు చర్యలు తీసుకోవడంలేదు. వారానికోసారి అయినా చేయకపోతుండగా మస్కిటో నెట్‌తో పాటు బ్యాట్, దోమతెర, కాయిల్స్ వంటివి మస్ట్‌గా వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతిఏటా జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీగా డెంగ్యూ కేసులు నమోదవుతుంటాయి. కాగా... బల్దియా అధికారులుమాత్రం నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు చెబు తున్నారు. మూడేళ్లుగా డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలను హాట్ స్పాట్లుగా గుర్తిస్తు న్నారు. దోమల బ్రీడింగ్ పాయింట్లపైనా తగు నివా రణ చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నప్పటికీ దోమల వ్యాప్తి మాత్రం తగ్గడంలేదు. గ్రేటర్ సిటీలో 4,850 కాలనీలు ఉండగా డెంగ్యూ కేసులు వచ్చిన 24 గంటల్లోపు ఎక్కడైతే కేసు నమోదైందో వెంటనే ఆ ప్రాంతంలో చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారే తప్ప గ్రౌండ్ లెవల్‌లో ఆ పరిస్థితులు కనిపిం చడంలేదు. పాతకూలర్లు, టైర్లలో నీరు చేరడంతో డ్రమ్ములు, కొలాయిల్లో నీరు ఉంచడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నట్లు అధికారులు గుర్తిస్తున్నారు. మొత్తానికి దోమల బెడద మాత్రం తగ్గడంలేదు. మూడేండ్లుగా దోమల నివారణకు జీహెచ్‌ఎంసీ రూ. 50 కోట్లకుపైగా ఖర్చు చేసింది.



**ఈ ప్రాంతాల్లోనే ఎక్కువగా...**

సిటీలోని బస్తీలు, కాలనీలు ఇలా అన్ని ప్రాంతాల్లోనూ దోమల సమస్య ఎక్కువవుతోంది. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో సాయంత్రం అయిందంటే బయట తిరగాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంది. డెంగ్యూ కేసులు నమోదవుతుండగా స్థానికుల్లో ఆం దోళన నెలకొంది. ఈనెలలో సిటీ పరిధిలోని జిల్లాల్లో డెంగ్యూ కేసులు 200కుపైగా నమోదయ్యాయి. అధికంగా హాస్టల్స్, స్కూల్స్ ఉన్న ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి ఎక్కువగా ఉంది. బల్దియా ఎంట మాలజీ విభాగంలో 2,300 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వీరు రెగ్యులర్‌గా ఫాగింగ్, యాంటి లార్వా ఆపరేషన్ వంటివి చేపట్టాలి. ఇందుకు డివిజన్‌కు రెండు చిన్న మెషీన్లు 45 లీటర్ల రెండు పెద్ద మెషీన్లు ఉన్నాయి. కనీసం వారానికి ఒకసారి మస్ట్‌గా ఫాగింగ్ చేయాల్సి ఉంది. చెరువులు, కుంటలు, మూసీ పరివాహక ప్రాంతాల్లో వారానికి రెండు సార్లు చేయాల్సి ఉంది. ఇందుకు ఒక్కొక్కరికి 100 నుంచి 150 ఇండ్లను కేటాయిస్తారు. వీరితో ఉన్నతాధికారులు సక్రమంగా పని చేయించలేక పోతున్నారనే విమర్శలు ఉన్నాయి.

**అలర్ట్‌గా ఉండాలని సిఎం ఆదేశించినా...**

సిటీ శివారులోని బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట్, బడంగ్‌పేట, బండ్లగూడ, జాగీర్, మీర్‌పేట కార్పొరేషన్లతో పాటు 23 మున్సి పాలిటీలు ఉన్నాయి. ఈ ప్రాంతాలోని కొన్ని కాలనీ లో నెలకోసారి కూడా ఫాగింగ్ చేయడం లేదు. దోమల కారణంగా డెంగ్యూ కేసులు నమోదవుతు న్నాయి. ఆయా ప్రాంతాల్లో డెంగ్యూపై ప్రజలకు కనీస అవగాహన కల్పించే వారు లేరు. సీజనల్ వ్యాధులపై అలర్ట్‌గా ఉండాలని, ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినా అధికారులు మాత్రం అలసత్వాన్ని వీడటం లేదు. డెంగ్యూతో ప్లేట్‌లెట్స్ తగ్గి చిన్నారులు ఆస్ప త్రుల పాలవుతు న్నారు. చాలా మంది ప్రైవేట్ ఆస్పత్రుల్లో ట్రీట్‌మెంట్ తీసుకుంటుండగా నీలోఫర్ హాస్పిటల్‌కు కూడా వస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే వచ్చే నెలలో పరిస్థితి మరింత తీవ్రం అయ్యే అవకాశముంది.

**సరిగా ఫాగింగ్ చేయట్లేదు..**

మా ఏరియాలో నెలలో ఒక్కసారైన ఫాగింగ్ చేయడంలేదు. వర్షాలతో దోమలు ఎక్కువయ్యాయి. దోమలపైనా అసలే పట్టించుకోవడం లేదు. ఉద యం, సాయంత్రం అని తేడా లేకుండాపోతుంది. నిత్యం ఫాగింగ్ చేస్తే దోమల సమస్య తగ్గుతుంది.

**–వంజరి సంతోష్, కేశవ్‌నగర్, బోడుప్పల్**


తీర్మాన్ మల్లన్నను పరామర్శించిన బిసి కుల సంఘాల జేఏసీ నేతలు

## తీన్మార్ మల్లన్నపై దాడిని ఖండించిన బిసి కుల సంఘాల జెఎసి

**హైదరాబాద్, జూలై 13 ప్రభాతవార్త :** ఎమ్మెల్సీ, సీనియర్ జర్నలిస్టు తీన్మార్ మల్లన్నపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటి చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, సమన్వయ కమిటి రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, సుగూరి దుర్గయ్యగౌడ్ అన్నారు. ఆదివారం క్యూన్యూస్ ఆఫీస్‌పై కవిత జాగృతి అనుచరులతో చేసిన దాడిలో గాయపడిన మల్లన్నను వారు పరామర్శించారు. అనంతరం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... బీసీ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న మల్లన్నపై అనుచిత వ్యాఖ్యాలు చేసేరనే నేపంతో ఆయన కార్యాలయాన్ని ధ్వంసం చేయడంతోపాటు మల్లన్నను, అందులో పనిచేస్తున్న సిబ్బందిపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. బీసీలపై ప్రేమ కురిపిస్తున్న కల్వకుంట్ల కవితకు బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ప్రశ్నించే వారిపైనా దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేయడం సరైంది కాదని వెంటనే తీన్మార్ మల్లన్నకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తీన్మార్ మల్లన్నపై దాడి చేసినవారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, డిజీపీ స్పందించి ఎ వన్‌గా కల్లకుంట్ల కవితపైన కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్, నాయకులు వట్టే జానయ్య యాదవ్, పొలిటికల్ జేఏసీ కో చైర్మన్ హరిశంకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## కాలనీల అభివృద్ధికి కృషి చేయాలి : ఏసిపి


వెంగళరావునగర్ కాలనీ అసోసియేషన్ రిజిస్ట్రర్ పత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఏసిపి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 13 ప్రభాతవార్త :** కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు డి.వి.ప్రదీప్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం వెంగళరావునగర్ 'ఎ' టైప్ పార్క్ వద్ద నూతనంగా ఏర్పాటైన వెంగళరావునగర్ కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులతో ఎన్నికైన అసోసియేషన్ చైర్మన్, చీఫ్ అడ్వైజర్ డాక్టర్ పి.వి.రవిశేఖర్ రెడ్డితో కలసి అసోసియేషన్ రిజిస్టర్డ్ పత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించారు. రవిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ ప్రజలందరికీ అందుబాటులో ఉండి కాలనీ సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ సభ్యులతో కలసి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షునిగా రిటైర్డ్ సూపరిండెంట్ ఆఫ్ జైల్స్ లీ.రంగారావు, వైస్ ప్రెసిడెంట్‌గా ప్రొఫెసర్ డాక్టర్ టి.వరహాలరెడ్డి, జనరల్ సెక్రటరీగా రిటైర్డ్ సెక్షన్ ఆఫీసర్ జి.సారంగారావు, జాయింట్ సెక్రటరీగా ఎన్.జయచంద్ర వాసు, ట్రెజరర్‌గా హైకోర్ట్ న్యాయవాది ఐ.లక్ష్మీకాంతరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ప్రదీప్‌కుమార్, రామయ్య, కుటుంబరావు, నాగరాజు ఎన్నికయ్యారు. కార్యక్రమములో ఆర్టీసి రిటైర్డ్ రీజనల్ డైరెక్టర్, వెంగళరావునగర్ కాలనీ సీనియర్ సిటిజెన్ అధ్యక్షులు బాలకృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

## రాజమార్గంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు తీసుకురావాలి : ఎర్ర సత్యనారాయణ


మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

**సైఫాబాద్, జూలై 13 ప్రభాతవార్త:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లపై కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై పూర్తిస్థాయిలో ఒత్తిడీ తీసుకురావాలని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేసి సాంకేతికంగా, న్యాయబద్ధంగా ప్రశ్నించబడే ఆర్డినెన్స్ ద్వారా 42 శాతం బిసి రిజర్వేషన్‌లు అనే ప్రభుత్వ ప్రకటనపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, బిజెపి బిసిలపట్ల తీవ్రంగా నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు. బిసిలకు కేవలం స్థానిక సంస్థల రిజర్వేషన్‌లేకాదని, విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై వత్తిడిచేసి రాజ మార్గంలో రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ రిజర్వేషన్‌లపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నాయకులు కొలా జనార్ధన్, శ్రీనివాస్‌యాదవ్, ఎస్.దుర్గయ్యగౌడ్, అయిలీ వెంకన్న, మీనగా గోపి పాల్గొన్నారు.

## మాలలు ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలి : చెన్నయ్య

**సైఫాబాద్, జూలై 13 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ ద్వారా మాలలకు జరిగిన అన్యాయాలపై భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా ఈ నెల 28 నుంచి ఆగస్టు 23 వరకు జరిగే వివిధ కార్యక్రమాలను విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. ఆదివారం నాడిక్కడ జరిగిన మాల మహానాడు ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్‌లు కేటాయింపులో జరిగిన అన్యాయంపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. సుప్రీంకోర్టు సూచనలు పాటించకుండా సరైన ఎంపిరికల్ డేటా లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేసిన వర్గీకరణ వల్ల మాలలకు విద్యా, ఉద్యోగ రంగాలలో తీరని నష్టం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలు వర్గీకరణపై పోరాటం చేస్తూనే ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజ్యాంగంలో ఎస్సీలకు కల్పించిన 15 శాతం విద్యా, ఉద్యోగ రిజర్వేషన్ అవకాశాల్లో మాలలకు 5 శాతానికి పరిమితం చేయడంతోపాటు 22, 41వ రోస్టర్ పాయింట్‌లు కేటాయించడం ఉద్దేశపూర్వకంగానే మాలలను అణిచివేయడమేనని ఆరోపించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె.రాజేష్‌ను చెన్నయ్య నియమించి, నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు సరళ, కె.లలిత, సతీష్, రతన్ పాల్గొన్నారు.


రాజేష్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న జి.చెన్నయ్య. వెంకటేశ్వర్లు

# అత్యుత్తమ కథల సంకలనం


విభిన్న కథా సంకలాన్ని ఆవిష్కరిస్తున్న కొలకలూరి ఇనాయిక్, శాంతికృష్ణ, అంపశయ్యనవీన్ తదితరులు

**రవీంద్రభారతి, జూలై 13 ప్రభాతవార్త :** వివిధ విషయాల అత్యుత్తమ 20 కథల సమాహారం విభిన్న కథా సంకలనమని శ్రీవేంకటేశ్వర మహిళా విశ్వ విద్యాలయం పూర్వ అధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో తెలుగు సాహితీవనం 8వ వార్షిక మహోత్సవం-2025లో ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు పుస్తకాల ఆవిష్కరణలు, పురస్కారాల ప్రదానోత్సవ జరిగింది. కార్యక్రమాల్లో శాంతికృష్ణ సభాధ్యక్షతన జరిగిన ప్రారంభసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య కొలకలూరి ఇనాక్ విశిష్ట అతిథులు డా. అంపశయ్య నవీన్, పెద్దింటి అశోక్, ప్రద్యోతన్, సుమన ప్రణవ్ తదితరులతో కలిసి విభిన్న కథా సంకలనం పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఇక్కడ ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సాహితీమూర్తులు విచ్చేసి పాల్గొనడం గొప్ప విశేషం, తెలుగువారంతా ఎక్కడున్నా ఒక్కటేనని మరోసారి నిరూపించారన్నారు. రచయితలు తమ ఊరు, చుట్టూవున్న ప్రాంతాల మనుషులు, స్వభా వాల గురించి రాయండి... అప్పుడు దేశవిదేశాల్లో ఉంటున్న తెలుగువారు చదవడంవల్ల వాళ్ల మాతృభూమిలో ఉన్నంత తృప్తిచెందుతారని, అప్పుడు సాహిత్యానికి మంచి విలువ వస్తుందని ఇనాక్ సూచించారు. అనంతరం ముందుగా డా. తిక్కా సత్యమూర్తికి జీవనసాఫల్య, డా. గడ్డం శ్యామలకు మహిళా ప్రతిభా, కిడాల శివవకృష్ణకు యువసాహితీ పురస్కారాలు-2025; తదుపరి తెలుగు సాహితీ వనం నిర్వహించిన కవిత, కథా పోటీల్లో విజేతలకు కవితా, కథా పురస్కారాలు; రాణీ పులోమాజాదేవి స్మారక కథా పురస్కారాలు ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. మధ్యాహ్నం సత్యాజీ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన డా. ఏనుగు నరసింహారెడ్డి గౌరవ అతిథులు శీలా సుభద్రాదేవి, డా. తంగెళ్ల శ్రీదేవిరెడ్డి, సంపత్ కుమార్, సోమశంకర్, వెంకట్ తదితరులతోకలిసి తెలుగు సాహితీవనంలోని ఇతర కవులు, కవయిత్రులు రచించిన ఏడు పుస్తకాలను ఆవిష్కరించి రచయితలను అభినందించారు. చివరిగా అరుణ సందడి, నవీన్‌చంద్ర హోతాల వందన సమర్పణతో మహోత్సవం విజయవంతంగా ముగిసింది.

## మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి సిఎం రేవంత్‌రెడ్డి

**కంటోన్మెంట్, జూలై 13 ప్రభాతవార్త:** మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలని, తెలంగాణ రాష్ట్రంలో వరాలు విస్తారంగా పడాలని అమ్మవారిని వేడుకున్నట్లు రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం సికింద్రాబాద్, సనత్ నగర్ నియోజకవర్గంలోని శ్రీ ఉజ్జయిని మహాకాళి దేవాలయంలో జరిగిన బోనాల వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్, అల్లాడి గౌరి శంకర్, నందికంటి రవి, ముప్పిడి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు కేవలం రాజకీయ లబ్ధి కోసమే

**సైఫాబాద్, జూలై 13 ప్రభాతవార్త :** మహిళా అని చూడకుండా కేవలం రాజకీయ లబ్ధికోసమే తీర్మార్ మల్లన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై చేసిన ఆరోపణాలను యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ బొల్ల శివశంకర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాగృతి, తమ సంస్థ కామారెడ్డి డిక్లరేషన్‌తోపాటు ప్రజా సమస్యలు, ఏడాదిన్నరగా బిసి సమస్యలపై పోరాటం చేస్తున్నదని చెప్పారు. వ్యక్తిగత దూషణాల కారణంగానే క్యూ న్యూస్ కార్యాలయంపై దాడులు జరిగాయని, వ్యక్తి దూషణలు బిసి ఉద్యమాన్ని నీరుగార్చే కుట్ర జరుగుతున్నదని, బహుజనుల రాజ్యాధికారం కోసం బిసిలు ఐక్యం అవుతారని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఏక్కడా కనిపించని మల్లన్న, తాను చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని జాగృతి అధికార ప్రతినిధి ఎల్చాలా దత్తాత్రేయ డిమాండ్ చేశారు. బిసి ఉద్యమ నేత ఆర్.కృష్ణయ్యను విమర్శించిన చరిత్ర మల్లన్నదని, బిసి ఉద్యమాన్ని భుజాన వేసుకున్న కవిత ఏకులంలో జన్మిస్తే మల్లన్నకు ఎందుకని ఆయన ప్రశ్నించారు. మల్లన్న ఎదిపడితే అది మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.

## ముగ్ధమనోహరం నేత్రపర్వం హర్షిణి కూచిపూడి రంగప్రవేశం

**నాంపల్లి, జూలై 13 ప్రభాతవార్త :** నటరాజ నాట్యాంజలి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ (అట్లాంటా) అమెరికా ఆధ్వర్యంలో ప్రఖ్యాత నాట్యగురువు నీలిమ గడ్డమనుగు శిష్యురాలు, కళ్యాణి వెంకటల తనయ హర్షిణి చుండి కూచిపూడి రంగప్రవేశ ప్రదర్శనలోనే కూచిపూడి నృత్యంలోని పూర్తి మెళకువలు ఔశానపట్టి సంపూర్ణ పరిణతితో రంగప్రవేశ ప్రదర్శన ముగ్ధమనోహరం, నేత్రపర్వంగా కావించి అశేష ఆహుతులను తన్మయుల్ని చేసింది. హర్షిణి విదేశాల్లో ఉన్నా స్వదేశం, అందులో స్వరాష్ట్ర శాస్త్రీయ నాట్యమైన కూచిపూడిని ఎంతో మక్కువతో అభ్యసించి మన కళలు, మాతృదేశాన్ని రాష్ట్రాన్ని మరువకపోవడం విశేషం. అలాగే నృత్యగురువు నీలిమ భారతదేశమంతటా వెయ్యికిపైగా ప్రదర్శనలివ్వడమే కాక డ్యాన్స్ అకాడమీని స్థాపించి 200మందికిపైగా శిష్యులను గొప్ప నాట్యకళాకారులుగా తీర్చిదిద్దడం మరో విశేషం. హర్షిణి తన కూచిపూడి రంగప్రవేశాన్ని ముందుగా గణేశకౌత్వంతో ప్రారంభించి తదుపరి భామాకలాపం, శివశివ భవభవ, కృష్ణ శబ్దం, సరస్వతీ స్తుతి, అన్నమాచార్య కీర్తన, తిల్లానా అంశాలను శృతిలయబద్ధంగా అలవోకగా నర్తించి చివరగా మంగళం అంశంతో ముగించి హర్షధ్వానాల మధ్య ప్రతీఒక్కరి ప్రశంసలు అందుకుంది. గురువు నీలిమ నట్టువాంగం, మృధురవళి, మంతా శ్రీనివాస్‌లు గాత్రం, చంద్రకాంత్ మృదంగం, లక్ష్మీనరసింహమూర్తి వయోలిన్, ఉమావెంకటేశ్వర్లు వేణువు, సుధాకర్ వీణలతో అద్భుత వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించి మెప్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ నర్తకి హర్షిణిని ఘనంగా సత్కరించి శుభాశీస్సులందజేసి మున్ముందు గొప్పనాట్యకళాకారిణి పేరెన్నిక పొందాలని ఆకాంక్షించారు.


హర్షిణి కూచిపూడి రంగప్రవేశంలో దృశ్యం


ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను సత్కరించిన దృశ్యం

## బోనాల ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి : ఎమ్మెల్యే ముఠా గోపాల్

**చిక్కడపల్లి, జూలై 13 ప్రభాతవార్త:** బోనాలు ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ కోరారు. ఇందులో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహకారం తప్పకుండా ఉంటుందన్నారు. ఆదివారం గాంధీనగర్‌లోని సిద్దంశెట్టి అపార్ట్మెంట్ ఆవరణలో ఉన్న బంగారం పోచమ్మ తల్లి దేవాలయం అభివృద్ధికి సహకారం అందించిన ముఠాగోపాల్ ను అపార్ట్మెంట్ అసోసియేషన్ సభ్యులు కలిసి సన్మానించారు.. ఈ సందర్భంగా బోనాల పండుగకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి జితేందర్, సంయుక్త కార్యదర్శి ప్రసన్న, పద్మ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న టిడిపి నేతలు

**ముషీరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** వీఐపీ దర్శనాల పేరుతో భక్తులకు అడుగడుగునా ఇబ్బంది కలిగించటం మంచి పద్ధతి కాదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా అన్నారు. ఆదివారం ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాలు సందర్భంగా ఆయన టీడీపీ నేతలతో కలసి మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రాబాదనాయుడు భక్తులకు అంతరాయం కలుగకుండా తెల్లవారుఝామునే అమ్మవారిని దర్శించుకుని వెళ్లేవారని గుర్తు చేశారు. ఈరోజు భక్తులకు తీవ్ర అంతరాయం కలిగిస్తూ వీఐపీ దర్శనాల పేరుతో కాంగ్రెస్ నాయకులు, మంత్రులు, వారి అనుచరులు ఘడియకు ఒకరు వస్తూ ఉండటం సరికాదన్నారు. పోలీసులు కూడా భక్తులను పట్టించుకోకుండా వీఐపీ సేవలో తరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, ఎబిఆర్ మోహన్, భాను ప్రకాష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## 'శివశక్తి విలాసం' నాటక ప్రదర్శన అద్భుతం

**చిక్కడపల్లి, జూలై 13 ప్రభాతవార్త:** అద్భుతంగా, అమోఘంగా 'శివశక్తి విలాసం' నాటక ప్రదర్శన రమణీయంగా, ఎంతో గొప్పగా నిర్వహించి నటీనటులు అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఇందులో ప్రధానంగా శ్రీనాధుని పాత్రను అత్యద్భుతంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రంగస్థల నటులు, కల్యాణానంద పీఠం అధినేత బ్రహ్మశ్రీ డాక్టర్ పులిగడ్డ హనుమంతరాయశర్మ నిర్వహించి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నాటక ప్రదర్శనలో ప్రతి ఒక్కరు తమతమ పాత్రలను పాత్రోచితంగా నటించి సభను మరింత రంజింపచేశారు. నాటకంలో డాక్టర్ శ్రీదేవి, గాయత్రి, ఉష, సాయి లలిత, చారిత్రక నవలాచక్రవర్తి డాక్టర్ ముదిగొండ శివప్రసాద్, పిఎంకె. గాంధి, భాగవంతుల చక్రవర్తి, వేలూరి రామకృష్ణారావు, దర్బార్ చంద్రశేఖర్, డాక్టర్ శంఖం నగేష్, శశికుమార్ శర్మ తదితరులు తమతమ పాత్రలను ఎంతో అద్భుతంగా, ఆధ్యాత్మిక భావాలు ఉట్టిపడే విధంగా నటించి మరింత శోభను తీసుకువచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త, తెలంగాణ బీసీ కమిషన్ పూర్వ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి రామ్‌దాస్ తేజావత్, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ పాల్గొన్నారు.


శివశక్తి విలాసం నాటక ప్రదర్శనలో ఓ సుందర దృశ్యం


అమ్మవారి ఆలయంలో పూజలుచేస్తున్న ఎమ్మెల్యే తలసాని, తదితరులు

## బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

**కంటోన్మెంట్, జూలై 13 ప్రభాతవార్త:** బోనాల మహోత్సవాలను పురస్కరించుకొని సికింద్రాబాద్ కీస్ హై స్కూల్ సమీపంలోని అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన బోనాల వేడుకలకు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపికలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## అమ్మవారిని వేడుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయి : ఎమ్మెల్యే


గండి మైసమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, జూలై 13 ప్రభాతవార్త:** అమ్మవారిని వేడుకుంటే కోరిన కోర్కెలు నెరవేరతాయని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. బోనాల ఉత్సవా లను పురస్కరించుకొని ఆదివారం కంటోన్మెంట్ మోండా డివిజన్ రెజిమెం టల్ బజార్‌లోని శ్రీగండి మైసమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల వేడుకలకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బాబురావ్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నేతలు అల్లాడి గౌరి శంకర్, నందికంటి రవి, ముప్పిడి మధుకర్, కె.శ్రీనివాసస్, చిర్రబోయిన సంతోష్ యాదవ్, సి.బద్రినాథ్‌యాదవ్, వరలక్ష్మి యాదవ్ తదితరుల పాల్గొన్నారు.

## ఉజ్జయిని మహాకాళి ఆలయంలో కార్తీక్‌రెడ్డి పూజలు


ఉజ్జయిని మహాకాళి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి తదితరులు

**కంటోన్మెంట్, జూలై 13 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాలి దేవాలయంలో నిర్వహించిన బోనాల వేడుకలకు గ్రేటర్ మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి నాయకుడు నాగేశ్వర్‌రెడ్డి, మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాని, నియోజకవర్గం నాయకులు వీరన్న, సంపత్ పాల్గొన్నారు.

## గండి మైసమ్మ దేవాలయంలో నాగేశ్ పూజలు

**కంటోన్మెంట్, జూలై 13 ప్రభాతవార్త:** బోనాల మహోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం సికింద్రాబాద్ స్టేషన్ ఎదురుగా ఉన్నా శ్రీ గండి మైసమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల వేడుకలకు కంటోన్మెంట్ తెలంగాణ ఉద్యమ నేత, బేవరేజెస్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు బాబురావ్ ముదిరాజ్, నర్సింహ్మ ముదిరాజ్, అల్లాడి గౌరి శంకర్, నందికంటి రవిలు పాల్గొని కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

## బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం : సాయికిరణ్

**చార్మినార్, జూలై 13 ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయికిరణ్ అన్నారు. కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ కార్యాయలంలో ఆయన డివిజన్‌కు చెందిన నాయకులతో కలిసి సమావేశాన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో పాతనగరం అన్ని రంగాలలోను ఎంతగానో అభివృద్ధి చెందిందని తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని, అభివృద్ధి జరగటం లేదని తెలియజేశారు. బిఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ అక్రమ్, మహ్మద్ రాషిద్ ఖాన్, సయ్యద్ షాబుద్దీన్, మహ్మద్ జహంగీర్, మహ్మద్ అమేర్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** సంగర జాతి సంఫ్, విద్యా సనర్ కమిటీ ఆధ్వర్యంలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి చదివే విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఆదివారం, నల్లకుంట నర్సింహ బస్తీలోని కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 40 మంది విద్యార్థులు పుస్తకాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, ప్రధానకార్యదర్శి పింజరి నర్సింగ్‌రావు, కోశాధికారి లక్ష్మణ్‌ప్రసాద్, ఆర్.కిషన్, కే.ప్రభురాజ్, ఎం.సురేష్, మహేంద్, అజయ్, గోవింద్, శివ, రాజేందర్, రవి, బబ్లు, నరేందర్ పాల్గొన్నారు.

## నృత్య గురువులకు నృత్య నీరాజనం

**చిక్కడపల్లి, జూలై 13 ప్రభాతవార్త:** బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణ లో ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభప్రధాన వేదిక పై గురుపూర్ణిమ పురస్కరించుకొని నాట్య గురువులకు వారి శిష్యులు నాట్య నీరాజనాలు అర్పించారు. కృష్ణప్రియ, ఆనందమయి, ప్రియ, కళ్యాణి హేమలత, లత రావు, సాయి పద్మజ, రవళి శిష్యులు పలు శాస్త్రీయ నృత్య అంశాలు చూడముచ్చటగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత న్యాయమూర్తి బి మధుసూదన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తరువాత గురువులకు దైవంతో సమానమైన స్థానం భారతీయ సంస్కృతి కల్పించిందన్నారు. వికలాంగుల సహకార ఆర్థిక సంస్థ పూర్వ చైర్మన్, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పిన్నమనేని సాయిబాబా మాట్లాడుతూ నేటి కాలం లో పిల్లలు గురువులకే కాదు తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వటం లేదని సమాజం ఎటు పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి పౌరులుగా సమాజంలో ఎదగాలంటే అది ఇంటినుంచే ప్రారంభం కావాలన్నారు. కథక్ నృత్య గురువు పండిట్ అంజిబాబు మాట్లాడుతూ గురువులు తమ శిష్యులకు మంచి విద్య నేర్పాలి అన్నారు. వేదిక పై నృత్యం చేసిన శిష్యులకు మంచి గురువులు శిక్షణ ఇచ్చారని అభినందించారు. బీ అర్ ఎస్ నాయకుడు నాగేష్ ముదిరాజ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ సంస్థ స్థాపకుడు విక్కీ మాస్టర్ నాణ్యమైన కార్యక్రమాలు సందర్భోచితంగా చేస్తారని అభినందించారు. వాస్తు సిద్ధాంతి గణేష్ ఆచార్య, సెన్సార్ బోర్డ్ సభ్యుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్న సభలో విక్కి మాస్టర్ నిర్వహణలో నాట్య గురువులను అతిథులు సత్కరించారు.


నాట్యగురువులను సత్కరించిన దృశ్యం

# సంస్కృతి సంప్రదాయాలకు నెలవు బోనాల ఉత్సవాలు

### తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వాధ్యక్షుడు కోలేటి దామోదర్‌గుప్తా


గురువు కాంతకుమారిని సత్కరిస్తున్న దామోదర్‌గుప్తా, రమణారావు, లలితారావు, శోభ తదితరులు

**రవీంద్రభారతి, జూలై 13 ప్రభాతవార్త :** గురుపూర్ణిమ, బోనాలు ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు నెలవని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ అధ్యక్షుడు కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. సామాన్యం ప్రతీ సంవత్సరం ఆషాడమాసంలో గురుపౌర్ణిమ, బోనాల పండుగలు వస్తాయని, పిల్లలకు ఆదిగురువు తల్లి అయితే వాళ్లు ఎక్కువ సమయం గడిపేది గురువు వద్దేనని, దేవునితో సమానమన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయం, కళలను పెంచిపోషిస్తూ కాపాడుతున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతాభినందనలు తెలిపారు. ఇలాంటి మహోన్నత పవిత్ర కార్యక్రమాలకు వేదికను అందించి ప్రోత్సహిస్తున్న నిర్వాహక సంస్థలు, అధిపతులు రమణారావు, లలితారావుల సేవలను ఎంతగానో ప్రశంసించారు. భారతీయ సంప్రదాయంలోని గురుశిష్యపరంపర కొనసాగుతుంటే మన విద్య, కళలు, సంస్కృతి, సంప్రదాయాలు నిత్యం ఫరిడవిల్లుతూ విశ్వవ్యాప్తం అవుతాయని, అలాగే ఆషాడ బోనాల ఉత్సవాలు మన ఆధ్యాత్మిక విలువలు, ప్రాముఖ్యత, ప్రాధాన్యత, వైభవాన్ని ప్రదర్శించడం భవిష్యతరాలకు ఆదర్శవంతం, ప్రపంచ దశదిశలా చేరుకొంటాయని స్వాగతోపన్యాసంలో కె.వి.రమణారావు తెలిపారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ జై జనాన్, జై కిసాన్, జై కళాకార్, భారత్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త నిర్వహణలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు, లయన్ లలితారావుల నిర్వహణలో గురుపూర్ణిమ సందర్భంగా గురుదేవోభవ; ఆషాడమాసం సందర్భంగా బోనాలు వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోలేటి దామోదర్‌గుప్తా విశిష్ట అతిథులు అద్దూరి కాంతకుమారి, శోభ దేశ్‌పాండే, జయతీర్థ తదితరులతో కలిసి ఈనాటి సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్న చిన్నారి కళాకారుల గురువులను ఘనంగా గురుసత్కారం, కళాకారులకు జ్ఞాపికలతో సన్మానించి శుభాభినందనలు తెలిపారు. సభకుముందు చిన్నారి కళాకారుల కళా, బోనాల ప్రదర్శనలు ఆహుతులను తన్మయుల్ని చేశాయి.



దుర్గమ్మ తల్లి బోనాల జాతరలో పాల్గొన్న బిఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

## దుర్గమ్మ ఆలయంలో వైభవంగా బోనాలు..

**దుండిగల్, జూలై 13, ప్రభాతవార్త :** మహాగణపతి సప్త మాత సహిత దుర్గమ్మ ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు వారు ఆదివారం బోనాల కార్యక్రమాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల పండుగ కార్యక్రమంలో పాల్గొనటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిన్నంగి వెంకటేష్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ జక్కుల శ్రీనివాస్ యాదవ్, పాక్స్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, నాయకులు ఈ శీను, ఉప్పరి కృష్ణ, ఆకుల ప్రేమ్ కుమార్, విష్ణుయాదవ్, కుమ్మరి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిఎం, కాంగ్రెస్ నేతలకు క్షీరాభిషేకం



కాంగ్రెస్ నాయకులకు పాలభిషేకం చేస్తున్న పార్టీ శ్రేణులు

**నిజాంపేట్, జూలై 13, ప్రభాతవార్త :** బిసిలకు స్థానిక ఎన్నికల్లో 42 రిజర్వేషన్‌కల్పిస్తూ సిఎం అధ్యక్షతన నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేసిన సందర్భంగా ఆదివారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ అధ్యక్షుడు గువ్వా రవి ముదిరాజ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్స రెడ్డి భూపతిరెడ్డి ఆదేశాల మేరకు నిజాంపేట్ రోడ్ హనుమాన్ టెంపుల్ బస్ స్టాప్ వద్ద ఓబిసి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ చిత్రపటానికి పాలాభిషేక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, ఎన్ఎంసి యాదవ సంఘం ప్రెసిడెంట్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి పూజలు చేసిన ప్రజాప్రతినిధులు

**బేగంబజార్, జూలై 13 ప్రభాతవార్త:** ఆషాడమాసం బోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఉస్మాన్‌గంజ్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో చైర్మన్‌గాల వినయ్‌కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో జీహెచ్ఎంసి ఫ్లోర్‌లీడర్ జి. శంకర్‌యాదవ్, పిషరీచైర్మన్ మెట్టు సాయికుమార్, కార్పొరేటర్లు రాకేష్‌జైస్వాల్, డాక్టర్ సురేఖ ఓంప్రకాష్ బిస్వా, గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆర్వీ మహేందర్ కుమార్, మహిళా నాయకురాలు శాంతిదేవి పాల్గొన్ని పూజలుచేశారు.

## కాంగ్రెస్ నాయకుల సంబరాలు

**యూసుఫ్‌గూడ, జూలై 13, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించినందుకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ కృష్ణానగర్‌లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే గుర్రం మురళీగౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చి సంబరాలు జరిపారు. ఏదైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 42శాతం బీసీలకు రిజర్వేషన్ ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ పర్సంటేజ్‌ను బీసిలకు మంచి పదవులు రావాలని ఆకాంక్షతో ముందుకు వెళుతున్నారని ఇపుడు ఆర్డినెన్స్ రెడీ అయిందని అన్నారు. అతి త్వరలో జరిగే ఎన్నికలు బ్రహ్మాండంగా నూటికి నూరు శాతం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు నియోజకవర్గంలో ఉన్న బీసీలందరు కూడా సంబరాలు చేసుకుంటున్నారని పేరొన్నారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి రమేష్, వినోద్, మహ్మద్ గౌస్, మహ్మద్ ఖాదర్‌భాయ్, వెంకట్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో మైనార్టీలకు పెద్దపీట

**యూసుఫ్‌గూడ, జూలై 13, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ మైనార్టీలకు పెద్ద పీట వేస్తుందని సికింద్రాబాద్ డిసిసి మైనార్టీ విభాగం చైర్మన్ మహ్మద్ మొసిన్ ఖురేషి అన్నారు. ఆదివారం రహ్మత్‌నగర్‌లో మైనార్టీ విభాగం నాయకులు మన్సూర్‌ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో రాబోయే శాసన సభ ఎన్నికలు గురించి ప్రత్యేకంగా చర్చించారు. కాంగ్రెస్ పార్టీ తరపున మైనార్టీలకు అధిష్టానం సీట్లు కేటాయిస్తే తామంతా కలిసి కట్టుగా పోరాడి జూబ్లీహిల్స్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

## టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్‌ను కలిసిన కాపు సంఘం నేతలు

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 13, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన కాపు సంఘం నేతలు టిపిసిసి ఉపాధ్యక్షులు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్‌ని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాపు సంఘం నేతలు బండి రమేష్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి కాపు సంఘం అధ్యక్షులు పిఎస్ఆర్ కె.భగవాన్, గౌరవ అధ్యక్షులు బచ్చు రాజా, ఉపాధ్యక్షులు బచ్చు మల్లి, వెంకట సుభాష్, మురళి , సెక్రెటరీ నరేన్, ట్రెజరీ కొత్తపల్లి సుబ్బారావు, సంఘం కార్యవర్గ సభ్యులు గంధం రామారావు, ఈశ్వర్, బాలాజీ, చైతన్యనాయుడు, సుబ్బు, సత్తిబాబు, సందీప్, హరి పాల్గొన్నారు. నూతనంగా ఏర్పడిన సంఘానికి బండి రమేష్ శుభాకాంక్షలు తెలియజేసి ఎటువంటి సమస్యలున్న అండగా ఉంటానని బరోసా ఇచ్చారు.

## ఘనంగా అషాడమాస బోనాల సంబురాలు

**శేరిలింగంపల్లి, జూలై 13 ప్రభాతవార్త :** ఆషాడమాసంలో అమ్మవారి బోనాల సంబురాలు అంబరాన్నంటాయి. శేరిలింగంపల్లి డివిజన్‌లోని ఆదర్శ్ నగర్ కాలనీలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో బోనాల పండుగను పురస్కరించుకుని ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్, టెంపుల్ కమిటీ ఆధ్వర్యంలో ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం, బోనాలఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మేయిన్ రోడ్డు వద్ద గల శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వరాలతో, సుఖసంతోషాలతో విరాజిల్లాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ రాజేశ్వరమ్మ, డాకయ్యగౌడ్, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్‌యాదవ్; కేఎన్‌రాములు, శ్రీకాంత్ దేవులపల్లి, తంబి, సైదులుయాదవ్, మహేందర్, దినేష్, ప్రభాకర్, సురేశ్, సలీం, సాయి, ఆదర్శ్‌నగర్ ఎల్లమ్మటెంపుల్ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## నెహ్రూ జూలాజికల్ పార్కులో వన మహోత్సవం

**చార్మినార్, జూలై 13 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పురలో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో ఆదివారం వన మహోత్సవం కార్యక్రమం జరిగింది. తెలంగాణ పిసిసిఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) డాక్టర్ సి. సువర్ణ, పిసిసిఎఫ్ (వైల్డ్‌లైఫ్) ఈలుసింగ్ మెరు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జూపార్కుల డైరెక్టర్ డాక్టర్. సునీల్ ఎస్. హిరామత్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హకీంతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా యాభై మొక్కలు నాటారు. కాగా సెర్వల్ జత పిల్లులను ఎన్‌క్లోజర్‌లోకి విడిచి పెట్టారు.

# బిసిలు రాజకీయ రంగంలో రాణించాలి

### మాజీ డీజీపీ, ఏఐబీఎస్పీ జాతీయ సమన్వయకర్త డాక్టర్ పూర్ణచంద్రరావు




సమావేశంలో పాల్గొన్న నేతలు

**హైదరాబాద్, జూలై 13 ప్రభాతవార్త:** త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సర్పంచులుగా, ఎంపీపీలుగా, జడ్పీ చైర్మన్లుగా పదవులు చేపట్టేలా చూడాలని రైల్వే ఉద్యోగులకు మాజీ డీజీపీ, ఏఐబీఎస్పీ జాతీయ సమన్వయకర్త డాక్టర్ జె.పూర్ణచంద్రరావు పిలుపు నిచ్చారు. ఉద్యోగులంటే ఉన్నత విద్యావంతులని, థింక్ ట్యాంక్ లాంటివాళ్లని, వీరంతా బీసీలకు వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. సికింద్రాబాద్ లోని రైల్ నిలయం ఆడిటోరియంలో ఆదివారం జరిగిన దక్షిణ మధ్య రైల్వే ఓబీసీ ఉద్యోగుల ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కాన్షీరాం బాటలో నడుస్తూ వాళ్లతో నామినేషన్లు వేయించాలని కోరారు. విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉన్న మొత్తం జనాభాలో సగం మంది బీసీలే ఉన్నారని, ఆ లెక్కన అక్కడి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం ముగ్గురు బీసీ ఎమ్మెల్యేలు ఉండాల్సిందన్నారు. గుంటూరు పార్లమెంటు పరిధి లోనూ అలాగే ఉందని తెలిపారు. కానీ ఎంత మంది ఉన్నారో మనం కళ్లెదుటే చూస్తున్నామన్నారు. తెలంగాణలోనూ అదే పరిస్థితి కనపడుతోందన్నారు. 17 పార్లమెంటు నియోజకవర్గాలకు గాను ఒక్కోదానికి ముగ్గురి చొప్పున చూసుకుంటే కనీసం 51 మంది బీసీ ఎమ్మెల్యేలు ఉండాల్సి ఉండగా కేవలం 19 మందే ఉన్నారన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోలలో భూములన్నీ రెండు సామాజిక వర్గాల చేతుల్లోనే ఉన్నాయన్నారు. వారి వద్ద బీసీలు కూలీలుగా మిగిలిపోతున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జరుగుతున్న అన్యాయం తెలుసుకుని, దాన్ని అందరికీ చెప్పడానికే నేను రాజకీయాల్లోకి వచ్చి బీఎస్పీలో చేరానని తెలిపారు. బీసీలకు జరుగుతున్న అన్యాయం గురించి తెలుసుకోవడంతో నేను ఆ పార్టీ నుంచి బయట కొచ్చి, కర్ణాటక బీఎస్పీవారితో కలిసి ఆలిండియా బీఎస్పీ అనే కొత్త పార్టీ పెట్టానని చెప్పారు. కల్లు గీశాం, చెప్పులు కుట్టాం, ఆవులు, గేదెలు కాశాం, పొలం పనులు చేశాం. ఇక అవన్నీ చాలు రాజకీయాలను ప్రధాన వృత్తిగా తీసుకుందామని పూర్ణ చంద్రరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చంద్రమోళి, ప్రధాన కార్యదర్శి బీవీఎన్ సత్యన్నారాయణ, మీనాక్షి, సంధ్యారాణి, పలువురు రైల్వే ఉద్యోగులు, అధికారులు, ఉద్యోగసంఘాల నేతలు పాల్గొన్నారు.

# తెలంగాణలో అధికారం సాధిస్తాం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు




మాట్లాడుతున్న ఎన్.రామచంద్రరావు

**గోషామహల్, జూలై 13ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టేందుకు బిజెపి కార్యకర్తల సహకారంతో ప్రజల్లో వెళ్లి కాంగ్రెస్ పార్టీని ఓడిస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు పేర్కొన్నారు. ఈమేరకు గొల్కొండ జిల్లా బిజెపి పర్యవేక్షణలో ఫీల్‌ఖానాలోని సంగ్‌బుషి భవన్‌లో ఏర్పాటు చేసిన గోషామహల్ నియోజకవర్గం బిజెపి ఆధ్వర్యంలో అభినందన సభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పార్టీ దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడి సారథ్యంలో అనేక సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుంద న్నారు. అంతేకాకుండా బిజెపి కార్యకర్తల పార్టీ అన్నారు. కార్యకర్తనే పార్టీకి అధ్యక్షులు అయ్యే చరిత్ర బిజెపికి ఉందన్నారు. బిజెపికి దేశ శ్రేయస్సు, సిద్దాంతాలతో ముందుకు వెళ్తుతుంద న్నారు. కాంగ్రెస్ పార్టీ మాదిరిగా మత, కుల రాజకీయాలు చేయద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదన్నారు. అటు బిఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ పార్టీలు ఓట్ల రాజకీయం చేసిందన్నారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి అక్రమ చొరబాటుదారులోపాటు రొహ్యింగాలకు రేషన్‌కార్డులు, ఆదారుకార్డులు, ఓటు హక్కులు కల్పించారని దుమ్మెత్తిపోశారు. స్లీపర్‌సెల్ ద్వారా ప్రమాదంఉందని తెలిసినప్పటికి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కఠిన చర్యలు చేపట్టడం లేదన్నారు. తెలంగాణ బంగ్లాదేశ్, పాకిస్తాన్, రోహ్యింగాలకు ధర్మశాల కాదన్నారు. మేము అధికారంలో వచ్చిన వెంటనే ఏరివేస్తామన్నారు. గ్రేటర్‌హైదరాబాద్‌లో ఇప్పటి నుంచి బిజెపి నాయకులు, కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి మేయర్ సీట్‌ను కైవసం చేసుకునేందుకు ప్రణాళిక బద్దంగా ముందుకు వెళ్తామన్నారు. ప్రతి కార్యకర్తకు బిజెపి అండగా ఉంటుందన్నారు. ఎవరికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో గొల్కొండ బిజెపి జిల్లా అధ్యక్షులు టి.ఉమా మహేంద్ర, జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ గొంటిశంకర్‌యాదవ్, మాజీ శాసనసభ్యులు ప్రేమ్‌సింగ్‌రాథోడ్, మాజీ బిజెపి గొల్కొండజిల్లా అధ్యక్షులు వి.పాండు యాదవ్, కార్పొరేటర్లు రాకేష్ జైస్వాల్, డాక్టర్ సురేఖ ఓంప్రకాష్ బిస్వా, లాల్‌సింగ్, బొయిని దర్శన్, బిజెపి నాయకులు గోవిందర్‌రాఠి, లక్ష్మణ్ సింగ్, అరుణజ్యోతి, మహేందర్‌వ్యాస్, ముఖఖరి మధుసూధన్, మాజీ కార్పొరేటర్ వై.కృష్ణ, సురేందర్ వందలాది మంది బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తెలంగాణ బిజెపి అధ్యక్షులు ఎన్.రామచంద్రరావును భారీ గజమాల వేసి ఘనంగా సన్మానించారు.



యువకుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

### బోనాల ఉత్సవాల్లో
## యువకుడిని చితకబాదిన పోలీసులు
### - సోషల్ మీడియాలో వీడియో వైరల్

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ బోనాల ఉత్సవాల్లో ఆదివారం ఓ యువకుడు బారికేడ్లను దాటుకుంటూ వస్తుండడంపై పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రద్దీ పెరుగుతుండడంతో సదరు యువకుడు ఎందుకు ఆపుతున్నారని పోలీసులను నిలదీసినందుకు సహనం కోల్పోయి చితకబాదారు. ఈ ఘటనను అక్కడే ఉన్న భక్తులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది.

## వివాహిత అదృశ్యం

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటున్న ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారంలో నివాసం ఉండే కేసు రత్నం కూతురు ఎం.సునీత (21) భర్తతో విడిపోయి తల్లిదండ్రులతో నివసిస్తుంది. జూన్ 6న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిన యువతి మరునాడు ఇంటికి వచ్చి.. తాను కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్‌లోని హాస్టల్లో ఉంటున్నట్టు చెప్పింది. కూతురుతో కలిసి హాస్టల్ చూడడానికి వచ్చిన తండ్రిని సర్వీస్ రోడ్డులో వదిలేసి ఆ యువతి వెళ్లిపోయింది. బంధుమిత్రులను విచారించిన ఫలితం లేకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఘనంగా చిగిరింత పెద్ద బాల్‌రెడ్డి దశదిన కర్మ

**సరూర్‌నగర్, జూలై 13 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ గ్రామానికి చెందిన ముఖ్యుడు, బాలాపూర్ చౌరస్తాలోని సూపర్ థియేటర్ అధినేత చిగిరింత పెద్ద బాల్‌రెడ్డి దశదినకర్మ ఘనంగా జరిగింది. బాల్‌రెడ్డి కుమారుడు చిగిరింత రాఘవేందర్‌రెడ్డి, సోదరులు చిగిరింత మల్లారెడ్డి, చిగిరింత శ్రీరాంరెడ్డి (పెద్ద నర్సింహారెడ్డి)ల ఆధ్వర్యంలో బాలాపూర్ చౌరస్తా సమీపంలోని ఆర్‌సిఐ రోడ్డులోనున్న సిఆర్ఆర్ కన్వెన్షన్‌లో దశదినకర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, పలువురు మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, బాలాపూర్ గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన పలువురు హాజరై బాల్‌రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలితో నివాళులర్పించారు.



పెద్ద బాల్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న సబితా ఇంద్రారెడ్డి తదితరులు

## అనుమానాస్పదస్థితిలో డెలివరీ బాయ్ మృతి

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** అనుమానాస్పద స్థితిలో డెలివరీ బాయ్ ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ ప్రాంతానికి చెందిన సత్యనారాయణ కుమారుడు శివకృష్ణ(20) వృత్తిరీత్యా డెలివరీ బాయ్ గా పనిచేస్తూ బర్కత్‌పురలోని భూమన లైన్‌లో ఐదు మంది స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. శనివారం అర్ధరాత్రి శివకృష్ణ అనుమానా స్పద స్థితిలో బెడ్ షీట్‌తో ఉక్కుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాచిగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీస్‌స్టేషన్ నుంచి ఐదుగురు మహిళలు పరార్

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** పాతబస్తీలోని పలు ఏరియాల్లో వ్యభిచారం నిర్వహిస్తు పటుబడ్డ మహిళలు ఆదివారం పోలీసులకు కళ్లుగప్పి పరారయ్యారు. సీసీఎస్ స్పెషల్ పోలీసులు ఆ ఏరియాల్లో దాడులు నిర్వహించి పట్టుబడ్డ బంగ్లాదేశ్‌కు చెందిన ఐదుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. సౌత్ జోన్‌లోని మహిళా పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో అదను చూసి పారిపోయారు. మహిళల ఆచూకీ కోసం పోలీసులు అక్కడున్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

## లాల్‌దర్వాజ బోనాలకు రంగం వంశీయుల ఘటం

**చార్మినార్, జూలై 13 ప్రభాతవార్త :** ఆషాడ మాస బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి అమ్మ వారికి రంగం వంశానికి చెందిన వారు గత కొన్ని దశాబ్దాలుగా అమ్మ వారికి ఘటాన్ని రూపొందిస్తున్నారు. కాగా పాతబస్తీ శాలిబండలోని శ్రీ కాశీవిశ్వ నాధ దేవాలయంలో ఆదివారం రంగం వంశీయులు అమర్ నాథ్ గౌడ్, రందీర్ గౌడ్, శ్రీ కాంత్ గౌడ్‌లు ఆమ్మ వారి ఘటాన్ని అలకరించి ఊరేగింపుగా లాల్‌దర్వాజలోని ఆలయానికి తీసుకు వచ్చారు. సోమవారం తిరిగి ఘటాన్ని తీసుకెళ్ళనున్నారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ గౌడ్ మాట్లాడుతూ గత కొనేళ్లుగా ఘటాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు.

## శ్రీనివాస్‌నగర్ పార్కులో ఉచిత వైద్యశిబిరం

### ప్రారంభించిన డిప్యూటీ మేయర్, మాజీ కార్పొరేటర్

**నిజాంపేట్, జూలై 13, ప్రభాతవార్త :** నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 7వ డివిజన్‌లో శ్రీనివాస్‌నగర్‌పార్కులో సిటీ న్యూరో సెంటర్ మియాపూర్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ సేవలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ రాఘవేంద్ర రావులు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్యాంపులో పలు రకాలైన వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారని, ప్రతి ఒక్కరు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఉచిత హెల్త్ క్యాంప్ సేవలు నిర్వహిస్తున్న సిటీ న్యూరో సెంటర్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ న్యూరో సెంటర్ వైద్యులు డాక్టర్ సాయి దినేష్, చక్రధర్ రెడ్డి, ఆప్తో గుప్తా, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలిలో వాట్సప్ కోడ్‌తో డెకాయ్ ఆపరేషన్

### లొకేషన్‌కు వచ్చిన 14 మంది

**హైదరాబాద్, జూలై 13 ప్రభాతవార్త:** నగరంలోని గచ్చిబౌలిలో గంజాయి వినియోగదారులపై 'ఈగల్ టీమ్ పోలీసులు డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు. పోలీసులు పేర్కొన్న లొకేషన్‌కి 14 మంది రావడంతో వారిని డీఅడిక్షన్ సెంటర్లకు తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల మహారాష్ట్రకు చెందిన గంజాయి సరఫరాదారు సందీప్‌ను ఈగల్ టీమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి ఫోన్లోని కాంటాక్ట్ లిస్ట్ ద్వారా డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. 'భాయ్ బచ్చా ఆగయా భాయ్' వాట్సప్ కోడ్‌తో గంజాయి వచ్చిందంటూ కస్టమర్లకు పోలీసులే మెసేజ్ చేశారు. దీంతో ఆ లొకేషన్‌కు 14 మంది గంజాయి వినియోగదారులు వచ్చారు. వీరిలో ఐటీ ఉద్యోగులు, రిలేషన్‌షిప్ మేనేజర్లు, ఆన్‌లైన్ ట్రేడర్లు, విద్యార్థులు, డెంటల్ టెక్నీషియన్లు ఉన్నారు. ఓ వ్యక్తి తన భార్య, నాలుగేళ్ల కుమారుడితో అక్కడికి రావడం గమనార్హం. ఈ 14 మందికి నిర్వహించిన యూరిన్ టెస్టులో పాజిటివ్ రావడంతో వారిని డీఅడిక్షన్ సెంటర్లకు తరలించారు.

## కనకదుర్గ ఆలయంలో పూజలు చేసిన భక్తులు

**పురానాపూల్, జూలై 13ప్రభాతవార్త:** ఆషాడ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి యేటా మాదిరిగానే ఈయేడు కూడా పురానాపూల్ స్వామి వివేకనందనగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారి ఘట్టాల పూజలు ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు అమ్మవారి దేవాలయంలో అమ్మవారి గీతాలను ఆలపించారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు శ్వేత, పోలే నాగేష్, మాగి ప్రభాకర్, పి.మహేందర్, గొల్కొండ ఎల్లమ్మ తల్లి తొట్టెల ఊరేగింపు చైర్మన్ ఎంపి.భీష్మా బస్తీ సంఘం అధ్యక్షులు ఎంపి సదానంద్, వందలాది నవ యువకులు పాల్గొన్నారు. అమ్మవారి ఘట్టాన్ని పురవీధులో శోభయాత్రగా నిర్వహించగా భక్తులు సాకాలు, అమ్మవారిక వడిబియ్యం పోశారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## బోనాల సందర్భంగా సీతారామ ఆలయంలో సమావేశం...

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 13, ప్రభాతవార్త :** ఆషాడమాసం బోనాల పండుగ సందర్భంగా కూకట్‌పల్లిలోని శ్రీశ్రీశ్రీ చిత్తారమ్మ తల్లి బోనాల జాతర సందర్భంగా కూకట్‌పల్లి శ్రీ చిత్తారమ్మ ఆలయంలో కార్యనిర్వహణ అధికారి అంజయ్యతో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు కలిసి వచ్చే ఆదివారం జరిగే బోనాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలనీ కమిటీ సభ్యులు కార్యనిర్వహణ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి అంజయ్య, సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు మాధవరం శ్రీనివాస్ రావు (టాకిల్), మేకల సుదర్శన్, సి హెచ్ శ్రీనివాస్ గౌడ్, ముసలి బాలరాజ్, తీగల కృష్ణారావు, గుత్తికొండ వెంకట్రావు, అరిగే శ్రీనివాస్, అంకెనపల్లి రమేష్, రాజు యాదవ్, తూర్పటి కృష్ణవేణి, యంజాల సుజాత, బాషుపాక నాగమణి పాల్గొన్నారు.

## కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటు...

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 13, ప్రభాతవార్త :** అన్ని రకాల పాత్రలను అవలీలగా పోషించి ప్రేక్షకు అభిమానాన్ని చురగొన్న సీనియర్ నటులు కోట శ్రీనివాసరావు మృతి చెందడం సినీ పరిశ్రమకు తీరని లోటని కూకట్‌పల్లి నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం నాయకులు కోదండరామయ్య పేర్కొన్నారు. కోట శ్రీనివాసరావు మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## డివి, టిఎన్‌ల జీవితాలు నేటి యువతరంకు ఆదర్శం కావాలి

### ప్రముఖ విప్లవ కవి నిఖిలేశ్వర్

**సైఫాబాద్, జూలై 13 ప్రభాతవార్త:** భూమి, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం కోసం జరుగుతున్న పోరాటాన్ని ముందుకు తీసుకు పోవడమే భారత విప్లవ కమ్యూనిస్టు విప్లవ పంథా నిర్మాతలు, విప్లవ రథ సారథులైన దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు, తరిమెల నాగిరెడ్డిలకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని ప్రముఖ విప్లవ కవి నిఖిల్వేర్ చెప్పారు. భారత విప్లవ రథసారథులైన వెంకటేశ్వర్‌రావు, తరిమెల నాగిరెడ్డి తమ రాజకీయ జీవితాన్ని విద్యార్థి దశ నుంచి ప్రారంభించి, కడవరకు నాలుగు దశాబ్దాలపాటు జీవితాన్ని త్యాగం చేశారని ఆయన కొనియాడారు. ఆదివారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యత కేంద్రం (మార్క్సిస్ట్-లెనినిస్ట్) ఆధ్వర్యంలో వెంకటేశ్వర్‌రావు, తరిమెల నాగిరెడ్డి సంస్మరణ సభలో ఆయన ప్రసంగించారు. ఆ ఇరువురు నేతలు ఆనేక ఆటుపోట్లు, నిర్బంధాలను ఎదుర్కొంటూ తమ శ్వాస ఉన్నంతవరకు ఉద్యమించారని ఆయన కొనియాడారు.

వారు ప్రజల కోసం రహస్య జీవితాన్ని గడిపి అమరులైనారని, వారి జీవితం నేటి యువతరానికి ఆదర్శ ప్రాయం కావాలని కోరారు.

ఈ సంస్మరణ సభలో విప్లవ నేతలు వి.ఎస్.వినోద్‌కుమార్, సి.భాస్కర్, జతిన్‌కుమార్, విజయేందర్, జి.వెంకట్రాది తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE: RANGA REDDY DISTRICT AT: HYDERABAD
O.S. No. 263 of 2025

Between:
Smt. Kallem Jayashree Reddy & 3 others ...Plaintiffs
AND
The Tahsildar, Balapur Mandal, Ranga Reddy District & all concerned ...Defendants

PUBLIC NOTICE

It is here by informed to General Public that, the above Plaintiffs i.e., 1) Smt. Kallem Jayashree Reddy, 2) Kallem Srikanth Reddy, 3) Kallem Sripal Reddy, 4) Kallem Nikitha Reddy have filed suit O.S. No. 263 of 2025 against 1) The Tahsildar, Balapur Mandal R.R Dist., & all concerned on the file of Hon'ble Principal District Judge, Ranga Reddy District, praying to declare the Plaintiffs as being only legal heirs of the deceased person named Smt. Late K. Madhavi. Any interested person in the above matter are here by informed that, they would appear in the court at 10.30 A.M on 30/07/2025 in the above court either through counsel or party-in-person, otherwise the Hon'ble court will decide the case on merits.

(BY ORDER OF THE COURT)
M/s. NALLA RAM BABU
ADVOCATE
Office: 12-13-705/9/A, Flat No. 302, SSR Enclave, Nagarjuna Nagar, Tarnaka, Hyderabd-500017 693, Ph No. 9703331616.

IN THE COURT OF THE HON'BLE III JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT : HYDERABAD
O.S. No. 5138 OF 2024

Between:
Sri Mahboob Alam Khan ...Plaintiffs
AND
Sri Rakesh Kumar Agarwal ...Defendants

To,
1. Sri Rakesh Kumar Agarwal, S/o Late Ram Kishan Agarwal, Aged about 54 yrs, Occ: Business, R/o 3-6-382, Street Noll, Himayat Nagar, Hyderabad.

Pleae take notice that the above named Plaintiff has filed a suit for Eviction and Deliver vacant Possession in respect of the Suit Schedule Property H.No.4-1-849, admeasuring 350 Sq.feet, Situated at Abids, Hyderabad, suit filed against you and the same is posted for your appearance on 23-July-2025 at 10.30 A.M. before the aforementioned court. If you failed to appear, the court will proceed to determine the matter on merits.

By the order of the Hon'ble court
Sd/- Mohd ADNAN
B.A. LLM,
Advocate
Office: 1st Floor, Rahman Plaza, YWCA Lane, Bogulkunta, Abids, Hyd-1,
Res: 8-13-67/1, Opp. NPA Shivrampally Road, RCHS Colony, Hyd-52, Cell: 9849302011

SUIT SUMMONS
IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL. JUDGE. CUM VI ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: L.B.NAGAR
O.S. No. 694 of 2025

Between:
Smt Pasula Sunkulamma & others ...Plaintiffs
And
To whomsoever concerned (All Concerned) ... Defendants

To
Whosoever concerned please take notice that the above Plaintiffs filed the above said case to declare them are the legal heirs / successors / surviving legal representatives of Late PASULA RAMUDU H/o PASULA SUNKULAMMA The same case is posted on 25/07/2025 for calling objections if any, if those who are having any objection/s may appear before this Hon'ble Addl. Junior Civil judge CUM VI ADDL. Judicial Magistrate Of First Class Medchal-Malkajgiri District at L.B Nagar on 25/07/2025 at 10-30 A.M. personally or through counsel, otherwise the matter will be decided as treating no objections.

(By order OF THE COURT)
T. Shiva Kumar
B. Vinod Kumar
K. Rakesh Kumar
Advocates
OFFICE: # Flat No.105, 2 nd Floor, Shiva Ganesh Nilayam, Near Medchal Court Complex, Medchal Municipality, Medchal-Malkajgiri District - 501 401.
Phone: 9346444426, 9000218686

IN THE COURT OF THE HON'BLE II SENIOR CIVIL JUDGE CCC AT : HYDERABAD
O.S.No. 613 OF 2025

Between:
1. Mrs. Vineeta Sha D/o. Late Sri Hiralal Choudhary & Late Smt Bimla Devi Choudhary, W/o. Ratan Kumar Sha, Aged about 66 years, occ: House wife, R/o. Flat No.402, Shobhanadri Apartments, Dharam Karam Road, Ameerpet, Hyderabad, Telangana State-500016.
2. Mr. Aloke Hiralal Choudary S/o. Late Sri Hiralal Choudhary & Late Smt Bimla Devi Choudhary, Aged about 67 years, occ: Retired Person, R/o. # 3/4, Mahavir Housing Society, Ichalkaranji, Hatkanangle, Kolhapur, Maharastra-416115.
3. Mrs. Sangeeta Modi D/o. Late Sri Hiralal Choudhary & Late Smt Bimla Devi Choudhary, Aged about 63 years, Occ: House Wife, R/o Anand Bhawan, Court Road, Opp Ranchi University, VTC: Ranchi, Jharkhand-834001.
4. Mrs. Manisha Agarwal, D/o. Late Sri Hiralal Choudhary & Late Smt Bimla Devi Choudhary, W/o. Ashok Kumar Agarwal, Aged About 59 years, Occ: House Wife, R/o. D-32A, Subhash Marg, C-Scheme, Jaipur, Rajasthan-302001 ...Plaintiffs
AND
1. The Tahsildar/MRO Ameerpet, Hyderabad-500016.
2. All Concerned. ...Defendants

NOTICE

Please take notice that the above named plaintiffs have filed above suit for declaration (OS 613/2025, pending before II Senior Civil Judge, at Hyderabad) to declare the Plaintiffs No.1 to 4 as the surviving legal heirs of Late Smt. Bimla Devi Choudhary who died intestate on 09.10.2024 and Late Sri. Heera Lal Choudhary who had died on 24-06-2009 leaving behind the plaintiffs as their surviving legal heirs, in respect of the suit schedule property and the matter is posted for any claims or objections from any concerned. Hence, if any person's is/are having any claims or objections they may be appear before this Hon'ble court on 07-08-2025 at 10.30 AM, either in person are through an advocate duly instructed, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

(SUIT SCHEDULE PROPERTY)
All that the Property bearing Flat No.2, on ground floor , Bearing MCH No. 7-1-80/2, in the Building Known as "KHEMSON Apartments" with a buit-up area admeasuring 1100 Sq Ft, (Including Common area), together with Proportionate Undivided share of land 49.40 Sq Yards or 41.29 Sq. Mtrs. out of total land 1386.66 Sq Yards, in the Premises bearing Municipal No. 7-1-80, Situated at Ameerpet, Hyderabad and bounded by: North : Open to Sky, South : Flat No.1, East : Open to Sky, West : Common Area.

(BY ORDER OF THE HON'BLE COURT)
G S JAGANNATH & K NAGA SANTOSH
ADVOCATES
Plot No.137, Road No.4, BPM Green Lands Colony, Peerzadiguda, Medipally-500098, Mob:-8247253245 / 9885279055



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

## పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

**కేశంపేట, జూలై 13, ప్రభాత వార్త :** పేద ప్రజల సొంత ఇంటి కల కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు గూడ వీరేశం అన్నారు . ఆదివారం కేశంపేట మండల పరిధిలోని కొనాయిపల్లి గ్రామంలో గ్యార కవిత సురేష్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పేదల చిరకాల ఆకాంక్షను నెరవేర్చాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ సహకారంతో కేశంపేట మండలంలో పెద్ద మొత్తంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కర్రెడ్ల నరసింహారెడ్డి, సోప్పరి జంగయ్య, రాజశేఖర్, శ్రీనివాస్, జంగయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుని అరెస్టు

**మేడ్చల్, జూలై 13, ప్రభాతవార్త :** వ్యక్తిని కొట్టిన చంపిన నిందితులను మేడ్చల్ పోలీసులు 24 గంటల లోపు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ చెక్‌పోస్టులో నర్సింహ్లు (35) చెత్త ఏరుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. చెక్‌పోస్టులోని వెంకటరమణ వైన్స్ ముందు శనివారం సాయంత్రం అతను మృతి చెంది ఉండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేసి మృతదేహాన్ని మార్చురీకి తలరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా మృతుడితో కలిసి చెత్త ఏరుకునే నర్సింహ, అనితలను అదుపులోకి తీచుకుని విచారించగా అసలు విషయాన్ని ఒప్పుకున్నారు. చెత్త ఏరుకునే వీరి మధ్య డబ్బుల విషయంలో విభేదాలు చెలరేగి గొడువ కావడంతో నర్సింహ, అనితలు కలిసి నర్సింహ్లును కట్టెతో, రాళ్లతో కొట్టగా అతను చనిపోయాడు. ఈ మేరకు కేసును 24 గంటల లోపే చేదించి ఇద్దరు నిందితులను పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



అత్వెల్లిలో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

## మేడ్చల్‌లో ఘనంగా బోనాలు

**మేడ్చల్, జూలై 13. ప్రభాతవార్త :** మేడ్చల్ మున్సిపాలిటీలో ఆదివారం బోనాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఏడుగుళ్ల ఆలయంలో, వినాయక్ నగర్‌లోని ఎల్లమ్మ ఆలయం, అత్వెల్లిలోని పోచమ్మ దుర్గమ్మ తల్లి దేవాలయాల్లో భోనాలు పండుగను జరిపారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. సాయంత్రం మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. పండుగ సందర్భంగా ఆలయాలను నిర్వహికులు అందంగా ముస్తాబు చేశారు. భక్తులు రాత్రి వరకు ఆలయాల్లో అమ్మవార్లను దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు.

**దౌల్తాబాద్ మండలంలో ..**

**దౌల్తాబాద్, జూలై 13, ప్రభాతవార్త :** దౌల్తాబాద్ మండలంలో ఆదివారం ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పక్కన వెలసినటువంటి గ్రామదేవత అయిన పోచమ్మకు, క్రింది మోసట్లలో కొలువుదీరిన పోచమ్మకు మహిళలు బోనాలను సమర్పించారు. గ్రామంలోని కొలువుదీరిన పోచమ్మ తల్లికి ఉద యం జల్దీ కార్యక్రమం నిర్వహించి, తర్వాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మహిళలు బోనాలను పసుపు-కుంకుమ, వేపకొ మ్మలతో అలంకరించి ఆటపాటలతో డబ్బుల చప్పుల్లతో, పోతురాజుల విన్యాసాలతో గ్రామ వీదుల గుండా బయలుదేరి అమ్మవారి చెంతకు చేరుకొని తమ మొక్కులను సమర్పించారు. సకాలంలో వర్షాలు కురు వాలనీ, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలనీ కోరుతూ అమ్మవారికి తమ మొక్కలను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా జగదాంబమాత పూజలు



ఫకీర్‌టెక్యాలో బోగ్-భండార్ కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్‌గౌడ్, తండా నాయకులు

**ఘట్‌కేసర్, జూలై 13, ప్రభాతవార్త :** ఘట్‌కేసర్ మున్సిపల్ ఘణాపూర్ ఫకీర్‌టెక్యాలో ఆదివారం శ్రీజగదాంబమాత, శ్రీసేవాలాల్ మహారాజ్ జెండా పూజ భోగ్-భండార్ కార్యక్రమం ఘనంగా జరిగింది. తండాలో కొలువై ఉన్న ఆలయంలో అమ్మవారికి, స్వామిలకు జెండా ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. తండా ప్రజల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా కాంగ్రెస్‌పార్టీ మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ముల్లి జంగయ్యయాదవ్‌లు విచ్చేసి జగదాంబమాత అమ్మవారిని, సేవాలాల్ మహారాజ్‌లను దర్శించుకొని భోగ్-భండార్‌లో పాల్గొనా న్నరు. ఈసందర్భం గా బోనాలను తీసుకువచ్చి అమ్మవారికి నైవేధ్యం సమర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచులు నానావత్ రూప్‌సింగ్‌నాయక్, బద్దం గోపాల్‌రెడ్డి, తండా నాయక్ వడ్త్య రాజునాయక్, కారోబారి నానావత్ హూస్సేనానాయక్, పూజారి రామావత్ అమర్‌సింగ్, తండా నాయకులు వడ్త్యా జయంధర్‌నాయక్, మేడ్చల్ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు నానావత్ సురేశ్‌నాయక్, సొసైటీ డైరక్టర్ మహేందర్‌నాయక్, మాజీ వార్డుసభ్యులు వడ్త్యా చాందీనాయక్, రామావత్ రాణి, భానావత్ కిషన్‌నాయక్, వడ్త్య పవన్‌నాయక్, జిల్లా ఎన్ఎస్‌యుఐ కార్యదర్శి నానవత్ శివాజీనాయక్, నాయకులు దేవుసింగ్‌నాయక్, వడ్త్య సురేశ్‌నాయక్, సురేశ్‌నాయక్, సంతోష్, చిట్టిబాబు, కిషోర్, శివరాజ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ఔషధాల భారం తగ్గించడమే లక్ష్యం

### మున్సిపల్ అధ్యక్షురాలు శైలజా హరినాథ్



జనరిక్ మెడికల్ షాపును ప్రారంభిస్తున్న మున్సిపల్ అధ్యక్షురాలు శైలజా హరినాథ్

**మేడ్చల్, జూలై 13, ప్రభాతవార్త :** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో కొత్తగా భారత్ వికాస్ జనరిక్ మెడికల్ షాపును ప్రారంభించారు. భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అశ్విని సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మెడికల్ షాపును మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజా హరినాథ్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, జనరిక్ మందులు నాణ్యతలో బ్రాండెడ్ మందుల కంటే ఏమాత్రం తీసిపోవని స్పష్టం చేశారు. వీటి ధరలు మాత్రం 30 నుండి 80 శాతం వరకు తక్కువగా ఉంటాయని, ఇది ప్రజలకు మందుల ఖర్చులను గణనీయంగా తగ్గించడంలో సహాయపడుతుందని ఆమె అన్నారు. జనరిక్ మందులు ప్రజలకు ఆర్థిక భారాన్ని తగ్గిస్తాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు ఇవి ఒక వరం అని ఆమె అభిప్రాయపడ్డారు.

**లాభాలు సమాజ సేవకు కేటాయింపు**

భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అశ్విని సుబ్బారావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ భారత్ వికాస్ జనరిక్ మెడికల్ షాపును కేవలం వాణిజ్యపరంగా కాకుండ ఒక గొప్ప సామాజిక బాధ్యతతో నడిపిస్తున్నామని వెల్లడించారు.

ఈ షాపు ద్వారా వచ్చే లాభాలను సంఘ సేవ కార్యక్రమాల కోసం వినియోగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అందులో ముఖ్యంగా వికలాంగులకు, త్రాగునీటి సౌకర్యాల కల్పనకు, ఆడపిల్లల సంక్షేమానికి, పేద విద్యార్థుల విద్యా సహాయానికి ఈ నిధులను ఖర్చు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సుబ్బారావు , ట్రస్ట్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఓం ప్రకాష్, ట్రస్ట్ సభ్యులు జలవేందర్, డాక్టర్ సుబ్బారావు, జనహిత ట్రస్ట్ మెంబర్ శ్రీదేవి, వ్యాపారవేత్త జనార్ధన్, మేడ్చల్ మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి మురళీధర్ గుప్త, ఎల్లంపేట్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శులు వంశీ విజయ్, ప్రేమదాస్, ఉపాధ్యక్షుడు మైసరి రాజు వంజరి, నాయకులు శ్రీకాంత్, బాబు రాజు, బాలకృష్ణ, వంశీ రెడ్డి, కవిరాజు, నర్సింగ్, పుష్ప మల్లారెడ్డి, భరత్, కేశవ రెడ్డి, నర్సింగ్ రావు, చీర్ల సత్య నారాయణ, యోగ శిక్షకులు కిషోర్, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

# చనిపోయిన జీవాలకు బీమా ఇవ్వండి

### గొర్రె మేకల పెంపక దార్ల సంఘం రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్



మాట్లాడుతున్న కిల్లె గోపాల్

**తలకొండపల్లి, జూలై 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న గొర్రె మేకల పెంపకదారుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడంలేదని గొర్రె మేకల పెంపకదారుల సంఘం రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలో గొర్రె మేకల పెంపక దారుల సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కిల్లె గోపాల్ ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గొర్రెల మేకలు సుమారు 2,40,000 ఉన్నాయని, వీటన్నిటికీ మేపటానికి భూమి సరిపోను లేదని, చిన్న కమతాలు కావడంతో నీటి లభ్యత పెరిగి వ్యవసాయ భూమి సాగులోకి రావడంతో మేతకు ఇబ్బందులు గురవుతున్నావని మరోవైపు అటవీ అధికారుల వేధింపులు పెరుగుతున్నాయని, భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇంత సమయం గడుస్తున్నప్పటికీ కనీసం గొర్రె మేకల పెంపకదారుల సమస్యలపై పట్టించుకోవడంలేదని, గొర్రెలు మేకలు అనేక ప్రమాదాలు కుక్క ల దాటికి గురై మృతి చెందిన వాటికి ఎలాంటి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం లేదని అని విమర్శించారు. గొర్రెల మేకలకు కనీసం నటల నివారణ మందులు మూడు నెలలకు ఒకసారి పంపిణీ చేయవలసి ఉన్నప్పటికీ ఇవేవీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ప్రభుత్వ ఆసుపత్రిలో కనీసం మందులు సైతం లేవని అన్ని రకాల మందులను, వ్యాక్సిన్‌లను ప్రభుత్వం ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలని పనివేళలో మార్పులు చేయించి ఉదయం ఏడు గంటలకే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

50 ఏళ్లు దాటిన గొర్రె మేకల పెంపకదారులకు పెన్షన్స్ 5000 రూపాయలు ఇప్పించాలని ప్రమాదాలకు గురై మృతి చెందిన గొర్రె మేకల పెంపకదారులకు 10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని , కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఎం.ఎల్ .ఎం. పథకంలో గొల్ల కురుమలకు 50 రిజర్వేషన్ సౌకర్యం కల్పిం చాలని ఆయన డిమాండ్ చేశారు. మండల కమిటీ ఎన్నితలకొండపల్లి మండల కేంద్రంలో జరిగిన గొర్రె మేకల పెంపకదారుల సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నిక చేశారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా జిల్లాల పెంటయ్య, మండల అధ్యక్షులుగా వై చిన్న మల్లయ్య, ప్రధాన కార్యదర్శి గా కటికల పాండు, తో పాటు 14 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ విష్ణువర్ధన్ మర్రి కృష్ణ నరేష్ శీను రాములు శ్రీశైలం వెంకటయ్య నరసింహ రామచంద్రయ్య జంగయ్య గణేష్ తదితరులు ఉన్నారు.

## బిసిలను కాంగ్రెస్ మోసం చేస్తోంది

### బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి

**ధారూరు, జులై 13, ప్రభాతవార్త :** బీసీల ు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ధారూర్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం టిఆర్ఎస్ బీసీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ హామీని నెరవేర్చాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత లేదని, కేవలం మాటలకే పరిమితమైందని విమర్శించారు. ఆర్డినెన్స్ ఎప్పుడు తెస్తారో చెప్పకుండానే రిజర్వేష న్లు అమలయ్యాయంటూ కాంగ్రెస్ నేతలు సంబురాలు చేసుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 42 శాతం రిజర్వేషన్లపై పూర్తి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కల్లా బొల్లి మాటలతో ప్రజల ు కాంగ్రెస్ మోసం చేస్తుందని చెప్పారు. హామీల అమలులో విఫలమైందని కాంగ్రెస్ ప్రభుత్వం నిలదీశారు. బీసీలందరూ ఐక్యతగా ఉండి తమ రిజర్వేషన్ల సాధనకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక ఎన్నికలో 42 శాతం బిసి. రిజర్వేషన్‌ను వెంటనే కల్పించి తర్వాతే స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ బి.సి.లకు ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండలం సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ ఉప్పు చంద్రమౌళి, మాజీ ఏఎంసి చైర్మన్ రాములు, సీతాగారి లక్ష్మయ్య, ఈడిగి చిన్నయ్య గౌడ్, అంజయ్య, ఈడిగి గోవిందరాజు గౌడ్, హఫీజ్ , దేవేందర్, మహేష్, అనంతయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెండు లక్షల ఎల్‌ఓసి చెక్కు అందజేత

**ధారూరు, జులై 13, ప్రభాతవార్త:** ధారూర్ మండల పరిధిలోని ము న్నూరు సోమరం గ్రామానికి చెందిన బైండ్ల సువర్ణకు రెండు లక్షల ఎల్ ఓ సి చెక్కును ఆదివారం అందజేశారు. వికారాబాద్ లోని ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు అందజేశామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాన్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తపల్లి విజయభాస్కర్ రెడ్డి సీనియర్ నాయ కులు బుజ్జయ్య గౌడ్, ము న్నూరు సోమరం మాజీ ఎంపిటిసి రవి, మాజీ సర్పంచ్, గ్రామ పార్టీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఒసి చెక్కులు అందజేస్తున్న మండల కాంగ్రెస్ నేతలు

## కాంగ్రెస్ హామీలన్నీ నిలుపుకుంటోంది

**నందిగామ, జులై 13, ప్రభాతవార్త :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేసేలా క్యాబినెట్ ఆమోదించటం హర్షణీయమని, ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీ నిలుపుకుందని మామిడిపల్లి కాంగ్రెస్ సీనియర్ నేత జినుగుంట్ల నవీన్ గౌడ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు ఎక్కువ శాతం మంది పోటీ చేసే అవకాశం కలుగుతుందని, తద్వార ప్రజాసేవ చేసే అవకాశం దొరుకుతుందని అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికె దక్కుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ ప్రభుత్వం ప్రజా ఆదరణ పొందడం గర్వకారణం అన్నారు.

## తీన్మార్ మల్లన్నపై దాడి హేయమైన చర్య

**నందిగామ, జులై 13, ప్రభాత వార్త:** అక్షరమే ఆయుధంగా అవినీతిని ఎండగడుతూ అనుక్షణం గడియారపు ముల్లులా పనిచేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న క్యూ న్యూస్ కార్యాలయపై ఎమ్మెల్సీ కవిత అనుచరులు దాడి చేయడం హేయమైన చర్య అని నందిగామ మండల బీసీ సేన అధ్యక్షులు తోట మహేందర్ జరిగిన ఘటనపై తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీన్మార్ మల్లన్నపై జరిగిన దాడి యావత్ బీసీల పైన జరిగిన దాడిగానే పరిగణించాలని ఆయన ఫైర్ అయ్యారు. లిక్కర్ స్కామ్ లో తిహార్ జైలుకు వెళ్లిన కవితమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తుంగలో తొక్కి యావత్ తెలంగాణ మహిళల మనోభావాలను దెబ్బ తీశారు అనే సంగతి మర్చిపోవద్దు.. అహంకారంతో మాట్లాడుతున్న మీ చేష్టలు ఇలాగే కొనసాగితే మిమ్మల్ని, మీ అనుచర వర్గాన్ని తెలంగాణలో తిరగనివ్వరనే సంగతి మర్చిపోవద్దని హెచ్చరించారు.

## అంబబేద్కర్ విధాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ఘట్‌కేసర్, జూలై 13, ప్రభాతవార్త:** వెనుకబడిన వర్గాలకు అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతోనే పదవులు, ఉద్యోగాలు వచ్చాయని అంకుశాపూర్ మాజీ సర్పంచ్ బత్తుల రామలింగంగౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 222వ వారం నిత్య పూజల మాల కార్యక్రమం నిర్వహించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం. అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా రామలింగం మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలనన్నారు. అంబేద్కర్ తోనే భారత దేశం ప్రపంచంలోనే అత్యంత ప్రజాస్వామిక దేశంగా పేరు తెచ్చుకుందని, సమాజంలో అందరూ సమానమేనని ఎవరు తక్కువ కాదనే భావనతో అందరికి ఓటు హక్కు కల్పించారని కొని యాడారు. అనంతరం రాజ్యాంగపీఠికపై అందరూ ప్రమాణం చేశారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మేకల దాసు, సత్యం, రాజేశ్‌కుమార్, సురేశ్‌గౌడ్, సుధాకర్, అశోక్, లలిత్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న రామలింగం, అరుణ్‌కుమార్ తదితరులు

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, జూలై 13, ప్రభాతవార్త:** వర్షాకాలం దృష్ట్యా చేపడుతున్న మరమ్మత్తు పనులు, కరెంట్ తీగల కింద చెట్లకొమ్మల తొలగింపు పనుల కారణంగా సోమవారం పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఘట్‌కేసర్ టిజిఎస్‌పిడిసిఎల్ ఏఈ బి.యశ్వంత్‌కుమార్ తెలిపారు. 11 కెవి చందుపట్లగూడ ఫీడర్‌లోని ఎదులాబాద్, చందుపట్లగూడ, పోతరాజుగూడెం, కొత్తగూడెంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంట్ ఉండదని, 11 కెవి ఎదులాబాద్ ఎజిఎల్ ఫీడర్‌లోని ఎదులాబాద్, చందుపట్లగఊబాద, పోతరాజుగూడెం, కొత్తగూడెం వ్యవసాయ మోటార్లకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఏఈ కోరారు.

## మీ అక్రమాలు భరించలేకే జనం తిరగబడ్డారు

### కవితపై మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల ధ్వజం

**కేశంపేట, జూలై 13, ప్రభాత వార్త :** కేశంపేట మండల కేంద్రంలోని కొత్తపేట గ్రామంలో మీడియా సమావేశంలో మాజీ జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి మాట్లాడుతూ బీసీలకు 42 రిజర్వేషన్లకు బ్రాండ్ అంబాసిడర్ తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సీఎంను విమర్శించే స్థాయి నీకు లేదు అంటూ కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పై విరుచుకుపడ్డారు. ఆదివారం కేశంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక నాలుగేళ్ల పాటు తెలంగాణ జాగృతి పేరుతో హడావిడి చేసిన కవిత ఆ తర్వాత ఎందుకు చల్లబడ్డారు.. తమ కార్యక్రమాలను ఎందుకు కొనసాగించలేకపోయారు.ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ వచ్చాక మీ జాగృతి అక్రమాలు భరించలేక జనం జాగృతమయ్యారని ఫలితంగా బీఆర్ఎస్ ఫెయిల్ మార్కులతో ఇంటి పాట పట్టిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అయితే సున్నా మార్కులే వచ్చాయని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా సున్నా మార్కులే పునరావృతం అవుతాయని ఆమె జోస్యం చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఖేల్ ఖతం.. దుక్నం బంద్ అవుతుందన్నారు. కవితక్క కాంగ్రెస్ మీద పనికిమాలిన ఆరోపణలు చేయడం మానేసి తమ పార్టీలో ఉన్న దయ్యాల మీద దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాని, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గాని పూర్తి సమయాన్ని కేటాయించి సెలవు కూడా లేకుండా ప్రజల కోసమే నిర్వ్యామమ్ లేకుండా పని చేస్తున్నారని పేర్కొన్నారు. కవితక్క ఎలాంటి టెన్షన్ తీసుకోవాల్సిన అవసరం లేదని తెలంగాణ ప్రజలు అభయహస్తం చేతిలో చాలా సంతోషంగా ఉన్నారని అన్నారు. నియోజకవర్గానికి వచ్చిన కవితక్కను తన పార్టీలోనే పలకరించే దిక్కు లేదని, ముందు ఇంట గెలిచి రచ్చ గెలవాలని హితువు చెప్పారు. మైక్ ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడే కవితక్క బీసీ రిజర్వేషన్లను కూడా తన ఖాతాలో వేసుకోవడం హాస్యాస్పదమన్నారు. బీసీ రిజర్వేషన్లకు బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆమె స్పష్టం చేశారు. ఇది ప్రజల పాలన, మీ గడీల పాలన కాదు.. రేవంత్ రెడ్డి అంటే ఫార్మ్ హౌస్ లో కూర్చుని కేసీఆర్ లా పనిచేసే వ్యక్తి కాదు. అను నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తి అని ఇకనైనా ఇలాంటి ఉత్తర ప్రసంగాలు మానుకోవాలని కవితకు తాండ్ర విశాల సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు అనసూయ, అరుణ, సుజాత, కళమ్మ, అస్మా, లలిత, లక్ష్మి ్మ, సువర్ణ, చెన్నమ్మ, నర సమ్మ తదితర మహిళా కార్యకర్తలు నాయకురాలు పాల్గొన్నారు.



రాష్ట్ర బీఎస్పీ నేతలు మాయావతితో సమావేశమైన దృశ్యం

## బలహీనవర్గాలను అణిచివేస్తున్నారు

### మాయావతికి రాష్ట్ర బీఎస్పీ నేతల మొర

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** బహుజన సమాజ్‌వాద్ పార్టీ అధినేత్రి, యూపీ మాజీ సీఎం మాయావతిని రాష్ట్ర నేతలు కలిశారు. ఆదివారం ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నోలోని బీఎస్పీ ఆఫీసుకు వెళ్లిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ముదిరాజ్ తదితరులు ఆమెను కలిసి రాష్ట్రంలోని పరిస్థితులను వివరించారు. దేశంలో మెజార్టీ ప్రజలు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నాయని వాపోయారు. కొన్ని వర్గాలు మాత్రమే అధికారాన్ని చేతబూని బడుగు, బలహీనవర్గాలను అణిచివేస్తున్నాయని అన్నారు. రాజ్యాధికార స్థాపనే ధ్యేయంగా రాష్ట్రంలో పని చేస్తున్నామని చంద్రశేఖర్ ముదిరాజ్ విశ్వాసం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లాలో సామాజిక న్యాయం కోసం బీఎస్పీ తప్ప ఏ రాజకీయ పార్టీలు లక్ష్యసాధన దిశగా నడవడం లేదన్నారు. స్థానిక సంస్థలే కాకుండా చట్టసభల్లోనూ సమాన వాటాలు కావాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది రాజకీయ పార్టీల బిచ్చకాదని, రాజ్యాంగం కల్పించిన హక్కు అని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అన్ని రాజకీయ పార్టీలు బహుజనులకే ఎక్కువ సీట్లు కేటాయించేలా ఒత్తిడి తెస్తామని ఆయన అన్నారు.



## సామూహికంగా గోరింటాకు సంబరం

**తలకొండపల్లి, జూలై13, ప్రభాతవార్త :** ఆషాఢం మాసం సందర్భంగా తలకొండపల్లి మండలంలోని చంద్ర ధన గ్రామములో శ్రీ హనుమాన్ దేవస్థానం వద్ద గ్రామ మహిళలందరూ కలిసి శ్రీ లక్ష్మీ ్మ అష్టోత్తర పారాయణము. మణిద్వీప వర్ణన, హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆషాఢ మాసంలో గోరింటాకు విశిష్టత గురించి తెలిపి మహిళలందరూ కలిసి సామూహికంగా గోరింటాకు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మహిళలు భక్తులు యువతులు తదితరులు పాల్గొన్నారు



కవితను కలిసిన తలకొండపల్లి మండల బిఆర్ఎస్ నాయకులు

## కవితకు బిఆర్ఎస్ నేతల సత్కారం

**కలకొండపల్లి, జూలై 13, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా కేశంపేట్ మండల కేంద్రంలో నాడు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బిఆర్ఎస్ తలకొండపల్లి మండల అధ్యక్షులు కుమ్మరి శంకర్ కలిశారు. కేశంపేట్ మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో వివిధ కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన కల్వకుంట్ల కవితను కుమ్మరి శంకర్ ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల బి ఆర్ఎస్ కార్యకర్తలు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, స్వామి గౌడ్, శంకర్ నాయక్, శేఖర్ తదితరులు ఉన్నారు.

## వైన్ షాప్‌లో రూ.15 వేలకు పైగా సొత్తు చోరీ

**షాబాద్, జులై 13, ప్రభాతవార్త :** షాబాద్ మండల కేంద్రంలోని లక్ష్మీ ్మనరసిం హ వైన్ షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. షాబాద్ పోలీస్ ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీ ్మనరసింహ వైన్స్ దుకాణంలో అమ్మకాలు కొనసాగించిన నిర్వాహకుడు మహేందర్ రాత్రి 10 గంటల తర్వాత వైన్స్ ను మూసివేసి తాళం వేసుకొని ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం వైన్స్ పక్కనే ఉండే రాజ్ కుమార్ దుకాణం వెనుక వైపు గోడకు పెద్ద రంధ్రం పడి ఉండడానికి గమనించి, వైన్స్ యజమానికి ఫోన్ చేసి చెప్పాడు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వైన్స్ లో నుండి రూ.15000 నగదు, 12 బాటిల్ల విస్కీ దొంగిలించి, మరో 20 బాటిళ్లను ధ్వంసం చేసినట్లు గుర్తించారు. దొంగల ఆచూకీ కోసం క్లూస్ టీంతో ఆధారాలను సేకరించారు. వైన్స్ యజమాని మామిడి విజయ పాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు కు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

